క్లుప్తంగా

ఏపీ వైఎస్సార్ టీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఎంపిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా కమిటీని ఎంపిక చేశారు. జక్కంపూడిలోని మండల ప్రజా పరిషత్ స్కూల్‌లో ఇటీవల జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో అందరి ఆమోదంతో నూతన అడహక్ కమిటీని ఎంపిక చేశారు. ఎన్నికల పరిశీలకుడిగా వైఎస్సార్ టీఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఎం.వి.మహంకాళిరావు వ్యవహరించారు. ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా డి.లక్ష్మీపతి, అధ్యక్షుడిగా టి.జగదీష్‌రెడ్డి (జగ్గయ్యపేట), ప్రధాన కార్యదర్శిగా కె.నెహ్రూ (ఎంపీపీ స్కూల్, జక్కంపూడి), కోశాధికారిగా జె.రవీంద్ర, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం.వెంకట్రావు, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే ఇంతియాజ్, వి.ధనలక్ష్మి, సహాయ కార్యదర్శిగా వీర్ల కిషోర్, ఆడిట్ కన్వీనర్‌గా పి.సుధాకర్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. నూతన కమిటీ సభ్యులను వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్ రెడ్డి అభినందిస్తూ విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలకు అనుగుణంగా ఉపాధ్యాయులు వ్యవహరించాలని కోరారు.

యువకుడి అనుమానాస్పద మృతి

గంపలగూడెం(తిరువూరు): మండలంలోని పెనుగొలను గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాంబాబు కథనం మేరకు.. పెనుగొలను గ్రామానికి చెందిన మోటపోతుల శ్రీకాంత్ (20)కు ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడు పసుపులేటి శ్రీనివాస్ వద్దకు తీసుకెళ్లారు. ఆర్‌ఎంపీ డాక్టర్ ఇంజక్షన్ చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తెలంగాణ రాష్ట్రంలోని మధిర పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే శ్రీకాంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆర్‌ఎంపీ వైద్యుడు చేసిన ఇంజక్షన్ వికటించినందునే తన కుమారుడు మృతి చెందాడని తండ్రి మోటపోతుల అనమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధితులకు అండగా జిల్లా పోలీసులు

స్పందనలో కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా



స్పందనలో బాధితుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్ (మచిలీపట్నం): పోలీస్ స్పందనలో అందిన అర్జీలపై అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి అవసరమైతే బాధ్యులపై కేసులు నమోదు చేయాలని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఆయన పాల్గొని, వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. న్యాయం కోసం వచ్చే బాధితులకు పోలీసులు అండగా నిలవాలన్నారు. అప్పుడే వారికి న్యాయం చేయగలుగుతామన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించినా, ఫిర్యాదుదారులతో అమర్యాదగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చినా ఉపేక్షించేది లేదని పోలీసు అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు.

అర్జీలు ఇలా..

- ప్రేమించి పెళ్లి చేసుకున్న తనను అత్తింటి వారు మానసికంగా వేధిస్తున్నారని, కట్నం తీసుకురావాలని బెదిరిస్తున్నారని మచిలీపట్నం నగరానికి చెందిన ఎం.హారిక స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేసింది. తన భర్త మెడికల్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారని, తాను కాన్పు కోసం పుట్టింటికి వెళ్లిన నాటి నుంచి ఆడపడుచులు, అత్తమామలు అధిక కట్నం తేవాలని వేధించటమే కాకుండా బిడ్డ పుట్టి యేడాది కావస్తున్నా తనను అత్తింటికి రానీయటంలేదని వాపోయింది. ఆమె ఫిర్యాదును సంబంధిత స్టేషన్ అధికారికి ఎస్పీ సిఫార్సు చేసి బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- తన భర్త వ్యసనాలకు బానిసై పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలంటూ తనను వేధిస్తున్నాడని పెడనకు చెందిన పి.అమలేశ్వరి ఫిర్యాదు చేసింది. పెద్దల ఒప్పందంతో తమ పెళ్లి జరిగిందని, మద్యానికి బానిసైన భర్త పదే పదే పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలంటూ వేధిస్తున్నాడని, తనపై మూడు సార్లు హత్యాయత్నానికి పాల్పడ్డాడని పేర్కొంది. స్పందించిన ఎస్పీ ఆమె ఫిర్యాదును సంబంధిత స్టేషన్ అధికారికి సిఫార్సు చేసి ఆమెకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముగిసిన వీఏఏల శిక్షణ తరగతులు



శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి

పామర్రు: విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షల గురించి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వీఏఏలకు ఇచ్చిన శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా వ్యవసాయ అధికారి ఎస్.పద్మావతి సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఈ నెల ఏడో తేదీన ప్రారంభించిన శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని ల్యాబుల్లో విధులు నిర్వహించే విస్తరణాధికారులకు విత్తన మొలక శాతాన్ని ఏ విధంగా పరీక్షించాలి, మెరుగైన విత్తనాలను ఎలా ఎంపిక చేయాలనే అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉండే ఎరువులు, పురుగు మందుల్లో నాణ్యతా ప్రమాణాలను పరీక్షించే విధానాలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ల్యాబుల్లో పని చేసే 52 మంది వీఏఏలు శిక్షణ పొందారని వివరించారు. మట్టి నమూనాల సేకరణ ప్రక్రియపైనా అవగాహన కల్పించామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బి.నాగార్జున, ఎ.హేమంత్‌కుమార్‌లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మచిలీపట్నం డీఏఓ కార్యాలయం వ్యవసాయ అధికారి(టెక్నికల్) సి.శాంత, పామర్రు ఏడీఏ స్వర్ణలత, ఏఓ శివనాగరాణి, ఏఓ టెక్నికల్ జి.శ్రీదేవి, విస్తరణాధికారులు టి.మణిమాల, జి.సునీల్ పాల్గొన్నారు.

కార్ల రవాణాతో రూ.19.14 లక్షల ఆదాయం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ బీడీయూ (బిజినెస్ డెవలప్‌మెంట్ యూనిట్) కొత్త ఆలోచనల ఫలితంగా డివిజన్ మొదటి సారిగా ఆటోమొబైల్స్ రవాణా చేపట్టింది. ప్రత్యేకంగా తయారు చేసిన వ్యాగన్‌ల ద్వారా 125 హుండాయ్ కార్లను విజయవాడ డివిజన్ మనుబోలులోని ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి న్యూ ఢిల్లీకి విజయవంతంగా పంపించారు. దీని ద్వారా డివిజన్‌కు రూ.19,14,795 ఆదాయం వచ్చిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ మాట్లాడుతూ.. కొత్త విధానాలతో సరుకు రవాణలో వృద్ధి సాధిస్తున్న కమర్షియల్ విభాగం అధికారులను అభినందించారు. రైలులో సరుకు లోడింగ్ చేయడం ద్వారా వేగం, సురక్షితం, భద్రతతో పాటు పర్యావరణ అనుకూలత సాధ్యమవుతుందన్నారు.

ముఠా కూలీ అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఠా కూలీ అదృశ్యంపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. ఏకలవ్య నగర్‌కు చెందిన వెంకటేశ్వరరెడ్డి గొల్లపూడి కాంప్లెక్స్‌లో కూలి పనులు చేస్తుంటాడు. అతనికి భార్య మార్తల నాగరత్నం, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల తొమ్మిదో తేదీన వెంకటేశ్వరరెడ్డి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య, పిల్లలు ఫోన్ చేసినా జవాబు ఇవ్వడం లేదు. ఇంటికి వస్తానంటూ వాట్సాప్‌లో మెసేజ్‌లు మాత్రం పెడుతున్నాడు. వెంకటేశ్వరరెడ్డి ఆచూకీ కోసం భార్య, పిల్లలు ప్రయత్నించినా ఫలితంలేకుండా పోయింది. బంధువులు, స్నేహితులను ఆరా తీసినా అతని ఆచూకీ తెలియకపోవడంతో వెంకటేశ్వరరెడ్డి భార్య నాగరత్నం భవానీపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కృష్ణానదిలో మృతదేహం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కృష్ణలంక పోలీసుల కథనం మేరకు.. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో రాజీవ్‌గాంధీ పార్కు ఎదురు కృష్ణవేణి ఘాట్ సమీపంలో నదిలోని నీటిలో ఒక వ్యక్తి మృతదేహం తేలుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని నదిలో నుంచి వెలుపలికి తీశారు. మృతుడి వయసు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని, అతని గురించి తెలిపే ఆధారాలు ఏవీ లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెరైన్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

కోడూరు(అవనిగడ్డ): కేంద్ర ప్రభుత్వ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు చెందిన ప్రతినిధులు కోడూరు మండలం, పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను సోమవారం పరిశీలించారు. క్వాలిటీ అధికారి బసవశంకర్ తన బృందం సభ్యులతో కలిసి స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం ఆదేశాల మేరకు తీరప్రాంత గ్రామాల్లో ప్రజల స్థితిగతులు, జీవన విధానాలను తెలుసుకొనేందుకు ప్రత్యేక సర్వేను నిర్వహిస్తున్నట్లు బసవశంకర్ తెలిపారు. ఇందులో భాగంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించామన్నారు. రికార్డులు అన్నీ సక్రమంగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అనంతరం సిబ్బందితో కలిసి పాలకాయతిప్ప గ్రామంలో పర్యటించారు. మెరైన్ సీఐ వల్లభనేని పవన్‌కిషోర్, ఎస్‌ఐ జిలానీ, రైటర్ రెహ్మాన్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

62 మందికి వైద్యసేవలు

కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో 62 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 104 సంచార వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ పి. నిహారిక రోగులకు షుగర్, బీపీ, మోకాళ్ల లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. హెచ్‌వీ విజయ కుమారి, డీఈవో కైలా కోమలి, సీహెచ్‌వో కే దివ్య, ఆరోగ్య కార్యకర్త కే రామాంజనేయులు, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

వార్డు సభ్యురాలిగా నిర్మల ఏకగ్రీవం

ముదినేపల్లి రూరల్ : మండలంలోని పెయ్యేరు పంచాయతీ రెండో వార్డు సభ్యురాలిగా దోబ నిర్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నిర్మల కుటుంబ సభ్యుల్లో ఒకరు ఈ పదవికి గతంలో ఎన్నికై మరణించడంతో ఉప ఎన్నిక నిర్వహించాల్సి వచ్చింది. ఈ పదవికి వైఎస్సార్ సీపీ బలపర్చిన కోటే రమేష్, టీడీపీ బలపరిచిన గూండా బత్తిన రాజేష్ సైతం పోటీ పడ్డారు. దీంతో రంగంలోకి దిగిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు ఆదివినయ్‌కుమార్, ఎంపీపీ రామశెట్టి సత్యనారాయణ ఇతర అభ్యర్థులతో మాట్లాడి నిర్మల ఏకగ్రీవంగా ఎంపిక కావడానికి మార్గం సుగమం చేశారు. పేర్నీడు పెదబాబు సమక్షంలో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో దోబ నిర్మల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎంపీటీసీ కోటే ప్రవీణ్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, జాస్తీ చంటి, బొర్రా శేషుబాబు, షేక్ అల్లాభక్షు, తదితరులు పాల్గొన్నారు.

సునీత ఏకగ్రీవం

మండవల్లి : మండలంలోని సింగనపూడి గ్రామ పంచాయతీ 1వ వార్డు సభ్యురాలిగా వడుపు సునీత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈఓపీఆర్డీ బి.ఆనంద బాబు సోమవారం పేర్కొన్నారు. ఆమెకు ధ్రువీకరణ పత్రం అందజేసినట్లు తెలిపారు. గ్రేడ్-1 ఆఫీసర్ కృష్ణారావు, కార్యదర్శి ఎస్‌వీ రాధిక పాల్గొన్నారు. అనంతరం ఆమె ఎమ్మెల్యే డీఎన్నార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎన్‌ఎంఆర్‌ల రోజువారీ వేతనం పెంపు

కృష్ణా కలెక్టర్ రాజాబాబు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్‌ఎంఆర్ (నామినల్ మస్టర్ రోల్) ఉద్యోగుల రోజువారీ వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు తెలిపారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో జిల్లా వేతన కమిటీ సమావేశం కలెక్టర్ చాంబర్‌లో సోమవారం జరిగింది. 2023–24 సంవత్సరానికి ఎన్ఎంఆర్‌ల వేతనం నైపుణ్యం లేని వారికి రోజువారీ వేతనం రూ.537 నుంచి రూ.569లకు, పాక్షిక నైపుణ్యం కలిగిన వారికి రూ.645 నుంచి రూ.683లకు, నైపుణ్యం కలిగిన వారికి రూ.752 నుంచి రూ.797లకు పెంచుతూ కమిటీ ఆమోదం తెలిపిందని కలెక్టర్ పేర్కొన్నారు. జీవన వ్యయ సూచిక ఆధారంగా ఎన్ఎంఆర్‌ల వేతనం పెంచామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కార్మికశాఖ డెప్యూటీ కమిషనర్ సీహెచ్ ఆశాలత, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.విజయకుమారి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చంద్రయ్య, ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ వి.రాజగోపాలనాయుడు, ఆర్అండ్‌బీ డీఈ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రూ.15 కోట్ల బోనస్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు, డైరెక్టర్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాడి రైతులకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొదటి మూడు నెలలకు రూ.15 కోట్లు బోనస్ రూపంలో చెల్లిస్తామని కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రకటించారు. సంస్థ బోర్డు డైరెక్టర్ల సమావేశం పాలప్రాజెక్టు ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో సోమవారం జరిగింది. ఈటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ముగ్గురు డైరెక్టర్లను బోర్డు సభ్యులకు చైర్మన్ పరిచయం చేశారు. అనంతరం ఏప్రిల్, మే, జూన్ నెలకు సంబంధించి పాడి రైతులకు ఇచ్చే బోనస్‌పై చర్చించారు. అనంతరం చైర్మన్ ఆంజనేయులు విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది నాలుగు విడతల్లో రూ.45 కోట్ల బోనస్ చెల్లించామన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఎండీ కొల్లి ఈశ్వరబాబు, బోర్డు డైరెక్టర్లు వేమూరి సాయి వెంకట రమణ, దాసరి వెంకట బాలవర్ధనరావు, శనగల వెంకటశివజ్యోతి, ఆర్జా నగేష్, చలసాని చక్రపాణి, వల్లభనేని బాబూరావు, ఉయ్యూరు అంజిరెడ్డి, బొట్టు రామచంద్రరావు, నెలకుదిటి నాగేశ్వరరావు, దుర్గిరాల మహేష్‌బాబు, పలగాని కొండలరావు, నెక్కలపు వాణిశ్రీ పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితుడికి మూడేళ్ల జైలు

గన్నవరం: ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితుడికి గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సోమవారం తీర్పునిచ్చింది. 2021 డిసెంబర్ 17న స్థానిక బుద్దవరం రోడ్డులో సిమెంట్ బల్లపై కూర్చుని ఉన్న దండమూడి సరోజినీదేవి మెడలోని నాలుగు కాసుల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన వ్యక్తి అపహరించుకుపోయాడు. 2021 నవంబర్ 18న కేసరపల్లిలో కిరాణా షాపు నడుపుతున్న గుడివాడ సత్యవతి మెడలోని కాసున్నర కాసుల బంగారు గొలుసును ఆగంతకుడు తెంచుకెళ్లాడు. 2021 నవంబర్ 14వ తేదీ సాయంత్రం స్థానిక శ్రీనగర్‌కాలనీలో వాకింగ్ చేస్తున్న భూరగడ్డ కృష్ణకుమారి మెడలోని ఆరు కాసుల బంగారు గొలుసును కూడా స్నాచింగ్ చేశారు. ఈ మూడు ఘటనలపై కేసులు నమోదు చేసిన గన్నవరం పోలీసులు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన షేక్ నాగుల్‌మీరా అలియాస్ బిల్లాను అరెస్ట్ చేశారు. స్థానిక 12వ ఏఎంఎం కోర్టులో ఈ మూడు కేసుల్లో నేరం రుజువు కావడంతో నిందితుడు నాగుల్‌మీరాకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.ప్రసన్న తెలిపారు.

ప్రభుత్వ సౌకర్యాలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడ టౌన్: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్‌లో నూతనంగా ప్రారంభించిన ఇంటర్మీడియెట్ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తోందని రూ.కోటి 80 లక్షలతో కొత్త జూనియర్ కళాశాల భవనాల నిర్మాణం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయం



విఠల్‌కు చెక్కు అందజేస్తున్న ఉమామహేశ్వరరావు, వీరాంజనేయులు, తేజ

తోట్లవల్లూరు: ఆర్యవైశ్యులు ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకోవాలని ఆర్యవైశ్య సంఘం జోనల్ కార్యదర్శి తమ్మన ఉమామహేశ్వరరావు కోరారు. మండలంలోని పెనమకూరు గ్రామానికి చెందిన కోపూరి దేవి వెంకటకృష్ణ లక్ష్మీప్రసన్న, కోపూరి సాయి వెంకట రాధాకృష్ణమూర్తి చదువులకు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఆవోపా) ఆపన్నహస్తం అందించింది. సంస్థ ఏపీ అధ్యక్షుడు తాడిపర్తి రాంబాబు ప్రతిభావంతులైన ఇద్దరు విద్యార్థులకు విద్యానిధి పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మంజూరు చేశారు. విద్యార్థుల తండ్రి విఠల్‌కు నగదు చెక్కులను ఉమామహేశ్వరరావు, ఆవోపా ఉయ్యూరు జోనల్ గౌరవాధ్యక్షుడు వెంట్రప్రగడ వీరాంజనేయులు, అధ్యక్షుడు నేరెళ్ల తేజా సాయివెంకట్ అందజేశారు. కొత్త శేష శ్రీనివాసరావు, తాడికొండ సుధాకర్, తాడికొండ కృష్ణకుమార్, తమ్మన సుబ్బారావు పాల్గొన్నారు.

ఈ-క్రాఫ్ నమోదు చేసుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి

కొండిపర్రు(పామర్రు): పంట నమోదు ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి అన్నారు. కొండిపర్రు గ్రామంలో ఈ–క్రాఫ్ బుకింగ్ కార్యక్రమాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. పామర్రు మండలంలో మూడు డ్రోన్ యూనిట్ల వరకు అందుబాటులో ఉన్నాయని వీటిని రైతులు సంఘాలుగా ఏర్పడి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌బీకేల వద్ద ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అవసరమైన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించాలని తెలిపారు. ఏడీఏ స్వర్ణలత, ఏవో శివనాగరాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు గృహాల నిర్మాణం పూర్తి

కైకలూరు: స్థానిక ఫైర్‌స్టేషన్ రోడ్‌లో పంచాయతీలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికుల కోసం 10 శాశ్వత నివాస గృహాలను నిర్మించారు. ఇందుకోసం పంచాయతీ నిధులు రూ.7 లక్షలు ఖర్చు చేశారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సూచనల మేరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. గృహాలను సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి పరిశీలించారు. త్వరలో పారిశుద్ధ్య కార్మికులతో గృహప్రవేశాలు చేయిస్తామని చెప్పారు.

పైపులైన్ విస్తరణ పనుల నిర్వహణ

మండవల్లి : కానుకొల్లులో సోమవారం సర్పంచ్ నాగదాసి థామస్ ఆధ్వర్యంలో పైపులైన్ విస్తరణ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయడమే లక్ష్యంగా పైపులైన్ విస్తరణ పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యదర్శి రత్నకుమారి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రస్తుత 2023–24 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్–కమ్–మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం సెప్టెంబర్ 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక సూచించారు. పరీక్ష రుసుం చెల్లించేందుకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల్లోపు ఉండాలని స్పష్టంచేశారు. కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ప్రైవేట్ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అర్హులు కాదన్నారు.

రంగా విగ్రహం ధ్వంసం శోచనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు : మాజీ ఎమ్మెల్యే దివంగత వీఎం రంగాకు మరణం లేదని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండలం సానారుద్రవరంలో రంగా విగ్రహాన్ని గుర్తుతెలియని కొందరు వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేయడంపై రంగా అభిమానులు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని రంగా అభిమానులను వివరాలు అడిగి తెలుసుకుని మాట్లాడారు. రంగా ఏ ఒక్క కులానికి, మతానికి పరిమితం కాదని అందరికి ఆరాధ్య దైవమని పేర్కొన్నారు. అలాంటి రంగా విగ్రహాన్ని ధ్వంసం చేయడం శోచనీయమన్నారు. దీనివల్ల రంగా ప్రతిష్ఠకు ఏమాత్రం భంగం వాటిల్లదన్నారు. ఇలాంటి చర్యలను చూస్తూ ఊరుకునేది లేదని నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుత విగ్రహ స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని ఇందుకు రంగా అభిమానులు సహకరించాలని కోరారు. ఎలాంటి ఆవేశాలకు లోనుకాకుండా సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకుందామని సూచించారు. దోషులను వెంటనే పట్టుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

అమర వీరులను స్మరించుకుందాం

కైకలూరు : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించినవారిని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని గోపవరంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో అనేకమంది ప్రాణాలర్పించి నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి పంచ్ ప్రాణప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, నాయకులు జయమంగళ కాసులు, బండి ప్రసాద్, ఉలిసి శ్యాంబాబు, గెద్దాడ కోటేశ్వరరావు, పోలవరపు శ్రీనివాసరావు, జల్లేరు కొండా, ఉలిసి వెంకన్న, ఉలిసి రాజు పాల్గొన్నారు.

ఎలకుర్రు(పామర్రు): మండల పరిధిలోని ఎలకుర్రు గ్రామంలో నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సోమవారం ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్ర్య సమర యోధుడు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు మనుమడు కేడీబీ ట్రస్టు చైర్మన్ కాశీనాథుని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీడీవో వై.రామకృష్ణ, సర్పంచ్ పానే శివ మస్తాన్‌రావు, రత్నకుమారి, కార్యదర్శి కుమారి, ఉదయ, పద్మ పాల్గొన్నారు. నిమ్మకూరు జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థుల ఆధ్వర్యంలో 50 మీటర్ల పొడవు గల జాతీయ జెండాను ప్రదర్శించారు. విద్యార్థులు జాతీయ నాయకులు గాంధీ, నెహ్రూ, నేతాజీ, అంబేడ్కర్ తదితర నాయకులు వేష ధారణలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ డి. అశోక్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీ ఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీ పద్మకుమారి పాల్గొన్నారు. పామర్రు-1 సచివాలయ వద్ద సర్పంచ్ కేతావతు కస్తూరి ఆధ్వర్యంలో నాభూమి–నాదేశం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. ఆరేపల్లి శ్రీనివాసరావు, తాడిశెట్టి శ్రీనివాసరావు, ఎండీ హస్మతుల్లా, దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి,ధనాల కృపావతి, సలీం పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: దేవరపల్లి, గురివిందపల్లి, పెనమకూరులోనాభూమి–నాదేశం కార్యక్రమాలు సోమవారం ఘనంగాజరిగాయి. దేవరపల్లిలో జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, పెనమకూరులో సర్పంచ్ నందేటి గంగాభవాని, గురివిందపల్లిలో సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్ అమరవీరుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. జాతీయ పతాకాలను ఎగురవేశారు. మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. వెంకట శివమధుబాబు, ఏఈఈ ఆర్.రాఘవరావు, వెంకటరత్నం,సుభాష్‌కుమార్ పాల్గొన్నారు.

పద్దారాయుడుతోట(మొవ్వ): మండలంలోని పాలంకిపాడు, చినముత్తేవి, బార్లపూడి, యద్ధనపూడి, పెదపూడి గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద శిలాఫలకాలు ఆవిష్కరించి, అమర వీరులకు నివాళులర్పించారు. సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సత్కరించారు. పద్దారాయుడుతోటలో సర్పంచ్ తాతా స్వప్న, ఎంపీటీసీ మురారి సత్యనారాయణ, ఈవో ఎంఎస్ఎస్ మూర్తిల ఆధ్వర్యంలో నిర్వహించారు. వృద్ధులను సత్కరించి మొక్కలు నాటారు.

గుడ్లవల్లేరు: మండలంలోని మామిడికోళ్లలో నా భూమి–నా దేశం నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ డి.శ్రీనివాస్, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, కార్యదర్శి సీహెచ్. ఉమామహేశ్వరరావు, సర్పంచి వర్రే విజయలక్ష్మి, వలంటీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడలో సోమవారం నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాను ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి, ప్రజాప్రతినిధులతో కలిసి ఎగుర వేసి ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. చీకుర్తి వరప్రసాద్, జాజుల శ్రీనివాసరావు, సర్పంచ్ అప్పికట్ల అశాజ్యోతి, వెంట్రప్రగడ గోపాలకృష్ణ, ఏపీవో స్ఫూర్తి, మండవ జానకరామయ్య, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్‌లో సోమవారం జాతీయపతాకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం టీఎంఈ రాణి, ఏసీ టీవీ రంగారావు, మున్సిపల్ ఇంజినీర్ ప్రదీప్ కుమార్, గొర్ల శ్రీను, మల్లిపూడి శ్రీనివాస చక్రవర్తి, వీరిశెట్టి నరసింహారావు, మాదాసు వెంకట లక్ష్మీకుమారి, మడకా ప్రసాదు, స్కూల్ కమిటి చైర్మన్ జి.సుమిత్ర, వైఎస్సార్ సీపీ నాయకులు మామిళ్ల ఎలీషా, తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- వేల్పూరులో గడప గడపకు మన ప్రభుత్వం



వేల్పూరులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందజేశారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. స్థానికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సెర్ప్ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తమ వేతనాలు పెంచినందుకు సెర్ప్ ఉద్యోగులు, సున్నావడ్డీ జమ చేయడంతో డ్వాక్రా మహిళలు ఆనందంతో సీఎంకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీని పరిశీలించారు. కాలనీలో ఖాళీగా ఉన్న స్థలంలో అవసరమైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు సూచించారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ముళ్లపూడి సర్పంచ్ అంజిబాబు, యలమంచిలి గణేష్, మారపాక మహేష్, శొంఠి వెంకటేశ్వరరావు, కంభపు రాంబాబు, ఎంపీడీఓ విఠల్‌పాల్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, తిరుమలశెట్టి బోసుబాబు, యేనుగ మస్తాన్‌రావు, యేనుగ వెంకటేశ్వరరావు, బొల్లా సాంబశివరావు,విద్యాధర్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామారావు మృతికి ఎమ్మెల్యే సంతాపం

ముదినేపల్లి రూరల్ : ముదినేపల్లికి చెందిన ప్రముఖ నాయకుడు దాగినేని రామారావు(85) ఆదివారం రాత్రి మృతి చెందారు. దాగినేని కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగి రాష్ట్ర విభజన అనంతరం వైఎస్సార్ సీపీకి పరోక్షంగా మద్దతు పలుకుతూ వస్తున్నారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ రామారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీటీసీ జంపన కోటేశ్వరరావు, మోట్రు ఏసుబాబు, నిమ్మగడ్డ భిక్షాలు, ఈడే వెంకటేశ్వరరావు, సాయిబాబు, బేతపూడి వెంకటరమణ, రామన నాగరాజు, కొల్లి నాని, జన్ను రాంబాబు, ఈడే ఉమ నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

11 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పామర్రు: స్థానిక లక్ష్మీనారాయణ రైస్ మిల్లులో పీడీఎస్ అధికారులు సోమవారం తనిఖీలను నిర్వహించారు. వచ్చిన సమాచారం మేరకు మిల్లును తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 11 క్వింటాళ్ల (50 కేజీల బస్తాలు 24) బియ్యం ఏవిధమైన బిల్లులు లేకుండా మిల్లులో ఉన్నట్లు గుర్తించారు. ఇవి పీడీఎస్ బియ్యంగా గుర్తించి వాటిని సీజ్ చేశామని అధికారులు తెలిపారు. పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిల్లు యజమాని బి.ప్రభుకుమార్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీఆర్వో రామ్‌లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

ముదినేపల్లి రూరల్ : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నూరుశాతం విజయం సాధిస్తుందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ నియోజకవర్గ నేత దూలం ఆదివినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వణుదుర్రులో టీడీపీ నాయకులు వీరమల్లు మల్లేశ్వరరావు, శివ, వీరగాని అశోక్, మురళీకృష్ణ, పడమటి కృష్ణచైతన్య, మూర్తి, గూడవల్లి బాలాజీ, వీరమల్లి సుబ్బారావు, శ్రీను ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన పలువురు ఆదివినయ్‌కుమార్, ఎంపీపీ సమక్షంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న ప్రజాహిత సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై అనేకమంది ఇతర పార్టీలను వీడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. మోట్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, లేళ్ళ ఆంజనేయులు, సాయిబాబు, రాచూరి కుమార్, సతీష్, బోయిన అప్పన్న, గుమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సర్పంచ్ పదవికి నలుగురు పోటీ

ముదినేపల్లి రూరల్ : మండలంలోని వణుదుర్రు పంచాయతీ సర్పంచ్ పదవికి నలుగురు అభ్యర్థులు రంగంలో మిగిలినట్లు రిటర్నింగ్ అధికారి షేక్ జరీనా తెలిపారు. 9 మంది నామినేషన్లు దాఖలు చేయగా సోమవారం ఐదుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా నలుగురు అభ్యర్థులు మిగిలారు. వీరిలో చిన్నం సుగుణబాబు, కోనాల రేవతి, చిన్నం వెంకటేశ్వరరావు, తోట వెంకటేశ్వరరావు రంగంలో ఉన్నారు. చిన్నం సుగుణబాబు వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీలో నిలిచారు. మిగిలిన ముగ్గురిలో టీడీపీ, జనసేన బలపర్చిన అభ్యర్థులు ఇద్దరు ఉన్నారు. ఈ నెల 19న ఉప ఎన్నిక జరగనుంది. పెయ్యేరు రెండో వార్డు సభ్యుడి ఉప ఎన్నిక ఏకగ్రీవం అయింది. దోబ నిర్మల ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

మహాసభలకు తరలిరండి

ముదినేపల్లి రూరల్ : విజయవాడలో ఈ నెల 21, 22వ తేదీల్లో జరిగే ఏపీఎన్జీవో మహాసభలకు తరలిరావాలని మండవల్లి యూనిట్ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు కోరారు.